తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
25-07-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 167
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## ప్రైవేటు సంస్థలకు దీటుగా రాణించాలి

- సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు
- రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి విస్తరించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మణుగూరు ఓసీ, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పరిశీలన

కొత్తగూడెం, సిరి న్యూస్ :
సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సింగరేణి

మిగతా 3వ పేజీలో..



## భద్రాద్రిలో 1870 మెగావాట్ల ఉత్పత్తిని ఆపేశారు

- ఉచిత కరెంటు ఇస్తే ఆదాయం రాదనే భయం
- నారుమళ్ల సమయంలో కరెంటు కోతలు పెట్టడమేంటి?
- నీళ్లు లేక మహిళలు బిందెలు మోస్తున్నారు
- సోలేపేట సబ్‌స్టేషన్‌ను తనిఖీ సందర్భంగా హరీష్‌రావు

2

# ఓసీ పాపం.. అధికారులకు శాపం!

- కనెక్షన్ ఇస్తే మెమోలు.. ఇవ్వకుంటే రాజకీయ ఒత్తిళ్లు

- ఓసీ అడ్డంకితో తలపట్టుకుంటున్న విద్యుత్ ఇంజనీర్లు
- మున్సిపాలిటీల్లో శాపంగా మారిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విధానం
- ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే నిలిచిపోయిన 5 లక్షల విద్యుత్ కనెక్షన్లు
- పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో సీఎండీ తీవ్ర ప్రయత్నాలు
- న్యాయపరమైన చిక్కులు చూపుతూ సీఎండీ నిర్ణయాలకు అడ్డుపడుతున్న వివాదాస్పద డైరెక్టర్
- ఓసీ నిబంధనను ఆసరాగా చేసుకుని లక్షల్లో దండుకుంటున్న మున్సిపల్ అధికారులు
- అధికారిక ఆదేశాలు రాకముందే ఓసీ లేకున్నా కనెక్షన్లు అంటూ ప్రచారం

2




## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదో రోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

4





## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

- కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు

3

## కొత్త డిజిటల్ వ్యవస్థతో ఆస్తులన్నీ ఒకే వేదికపై..!

- టీజీఎస్‌పీడీసీఎల్ డిజిటల్ పాలనలో మరో చారిత్రాత్మక మైలురాయి
- ఇన్-హౌస్ సాంకేతికతతో 'టీజీఎన్ఎంఎస్' జీఐఎస్ ఆధారిత వ్యవస్థ రూపకల్పన
- విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ ఆస్తులన్నీ ఇకపై ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం
- సీఎండీ జితేష్ వి. పాటిల్ మార్గదర్శకత్వంలో వేగంగా సాగుతున్న డిజిటల్ మ్యాపింగ్
- హైదరాబాద్ మెట్రో జోన్‌లో తొలి దశ మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతం
- రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో రెండో దశ పనులు పూర్తిచేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు కార్యాచరణ

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:
తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగంలో డిజిటల్ సంస్కరణలను అత్యంత వేగవంతం చేస్తోంది. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన, వేగవంతమైన విద్యుత్ సేవలు అందించాలనే ప్రధాన లక్ష్యంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తోంది. ఇందులో భాగంగా టీజీఎస్‌పీడీసీఎల్ ఇన్‌హౌస్ సాంకేతికతతో టీజీఎన్‌ఎమ్ఎస్ ద్వారా జిఐఎస్ నెట్‌వర్కింగ్ సిస్టమ్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఈ అధునాతన డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌కు సంబంధించిన సకల ఆస్తులను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేస్తున్నారు. దీనివల్ల ఎక్కడైనా విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే రియల్‌టైమ్‌లో

మిగతా 2వ పేజీలో..





## సైబర్ నేరాల కట్టడికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్

- సైబర్ భద్రతా ప్రమాణాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి
- సైబర్ సెక్యూరిటీపై వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ ఆనంద్

3

## కాళేశ్వరం నిర్వహణపై కేంద్రానికి లేఖ రాయాలి



- జల్ శక్తి శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి సాంకేతిక మార్గదర్శకాలు కోరాలి
- పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం
- అధికారులకు మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ ఆదేశాలు

హైదరాబాద్, సిరి న్యూస్:
కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తన అధ్యక్షతన కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణ, పాలమూరు

మిగతా 3వ పేజీలో..

## మోదీజీ మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు!

- నవతరం స్వరం మారుతోంది
- యువతరంతో పెట్టుకోవద్దు
- హక్కుల కోసం పోరాడే వారిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు
- సీబీఐ, ఈడీలకు యువతరం భయపడదు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో కేటీఆర్

హైదరాబాద్, జూలై 24, సిరి న్యూస్:
మోడీజీ మీరు పెట్టుకోకూడని వారి తో పెట్టుకున్నారు, యువతరంతో పెట్టుకున్నారు. మోడీ గారు జాగ్రత్త పడండి. స్వరం మారుతున్నది రాజ్యం ఉలిక్కి పడాలని కేటీఆర్

మిగతా 3వ పేజీలో..



## జెన్ జీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నిలదీయండి

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్నీ పేపర్ లీకులే
- ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీక్
- మరి ఆనాడెందుకు రాజీనామా చేయలేదు?
- విద్యార్థుల ముసుగులో కమ్యూనల్, కమ్యూనిస్టు శక్తులు
- ధర్నా చౌక్ ఎత్తేసినోడే ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేయడమా?
- కేటీఆర్ నిర్వాకంతో 27మంది చనిపోతే చర్యలేవి?
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి సంజయ్



హైదరాబాద్, జూలై 24, సిరి న్యూస్ :
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలో పరీక్షా పత్రాలు లీకయ్యాయని, మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. బీజేపీ

మిగతా 2వ పేజీలో..




## ఆరోగ్య శాఖకు ₹740 కోట్లు విడుదల!

- 1,569 కొత్త సబ్ సెంటర్ల నిర్మాణం
- పల్లెల్లోనే ఉచిత నిర్ధారణ పరీక్షలు
- గ్రామీణ వైద్యానికి మహర్దశ

హైదరాబాద్, జూలై 24, సిరి న్యూస్:
తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు ₹740 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప

మిగతా 3వ పేజీలో..

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

- వారందరికి కెటిఆర్ రూ.2 కోట్ల చొప్పున చెల్లించాలి
- బర్త్‌డే రోజయినా అబద్దాలు మాట్లడకుండా ఉండలేడు
- మీడియా సమావేశంలో మండిపడ్డ పిసిసి చీఫ్

3



## ఎన్టీఏలో భారీ ప్రక్షాళన

- నీట్ వివాదం తర్వాత పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సిద్ధం
- ఎన్టీఏలో 47 మంది అధికారుల తొలగింపు
- పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంపుపై కేంద్రం దృష్టి
- అవుట్‌సోర్సింగ్ విధానంలో సమూల మార్పులకు కసరత్తు
- ప్రశ్నాపత్రాల భద్రతకు కొత్త వ్యవస్థ అమలు చేసే యోచన

2

# ఓసీ పాపం.. అధికారులకు శాపం!

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:




నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేదన్న ఒక్క కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో, ప్రత్యేకించి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తీవ్ర సమస్యగా మారింది. ఓసీ లేక విద్యుత్ సదుపాయానికి దూరమవుతున్న దరఖాస్తులకు ఎలాగైనా అనుమతులివ్వాలంటూ ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో పరాకాష్టకు చేరాయి. పేద, మధ్యతరగతి ప్రజలు అతితక్కువ స్థలంలో నిర్మించుకున్న గృహాల్లో చిన్నపాటి నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయనే నెపంతో ఓసీ జారీ కాకపోవడం, దానివల్ల విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేమని అధికారులు తేల్చిచెబుతుండటంతో లక్షలాది కుటుంబాలు చీకట్లోనే నివసించాల్సిన దుస్థితి ఏర్పడింది.

**సమస్య పరిష్కారానికి కోర్టు కేసుల అడ్డంకి..**

గతంలోనూ ఓసీ లేని భవనాలకు విద్యుత్ సరఫరా ఇవ్వడంపై న్యాయస్థానాలు ప్రశ్నించినప్పుడు.. సంస్థ ఆర్థిక లావాదేవీలు, స్వయం ప్రతిపత్తి, దరఖాస్తుదారుల అవసరాలను ప్రామాణికంగా తీసుకుని విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు నాటి యాజమాన్యం కోర్టుకు స్పష్టం చేసింది. అయితే ఇటీవల కోర్టులు తాత్కాలిక సర్వీసుల శాశ్వత కొనసాగింపుపై ప్రశ్నలు గుప్పించడంతో, ఇప్పటికే ఉన్న తాత్కాలిక కనెక్షన్లను కూడా తొలగించాల్సిన సంక్లిష్ట పరిస్థితి దాపురించింది. ఈ న్యాయపరమైన చిక్కుల నుంచి విముక్తి కల్పించి, గ్రేటర్ పరిధిలోని 5 లక్షలకు పైగా బాధితులకు ఊరట నివ్వాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

**ప్రజల వైపు సీఎండీ.. బెదిరింపుల వైపు డైరెక్టర్!**

సంస్థ ప్రయోజనాలు, సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీఎండీ సానుకూల నిర్ణయాల దిశగా అడుగులు వేస్తుంటే, అదే సంస్థలోని ఒక వివాదాస్పద డైరెక్టర్ మాత్రం దానికి పూర్తిగా వ్యతిరేకంగా వ్యవహరించడం విద్యుత్ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. న్యాయపరమైన సాంకేతిక సమస్యలను మాత్రమే చూపుతూ సీఎండీ ఆలోచనలను క్రింది స్థాయి అధికారులు అమలు చేయకుండా ఆ డైరెక్టర్ బెదిరింపులకు దిగుతుండటంతో క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

**మున్సిపల్ అధికారులకు 'ఓసీ' కనకవర్షం**

విద్యుత్ కనెక్షన్ కావాలంటే ఓసీ తప్పనిసరి అనే నిబంధన మున్సిపల్ అధికారులకు కాసులు కురిపించే అవకాశంగా మారింది. అన్ని అనుమతులతో నిబంధనల ప్రకారం నిర్మించిన భవనాలకు సైతం ఓసీ జారీ చేయాలంటే లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మున్సిపల్ అధికారులు దండిగా డబ్బులు దండుకుంటుండటంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాయి.

**ఇంజినీర్లకు తీవ్ర తలనొప్పి.. మెమోల భయం**

మరోవైపు ఓసీ నిబంధన క్షేత్రస్థాయి సెక్షన్ అధికారులకు (ఏఈలు) నిత్యం నరకంగా మారింది. ఒకవైపు స్థానిక నాయకులు, మరోవైపు ఉన్నతాధికారులు రోజూ వందల సంఖ్యలో ఫోన్లు చేస్తూ కనెక్షన్లు ఇవ్వాలని ఒత్తిడి తెస్తుండటంతో సమాధానం చెప్పలేక అధికారులు సతమతమవుతున్నారు. పొరపాటున ఏ ఒత్తిడికో తలొగ్గి కనెక్షన్ ఇస్తే తదుపరి రోజే మెమో జారీ అవుతుండటంతో ప్రశాంతంగా ఉద్యోగం చేయలేక మదనపడిపోతున్నారు.

**అధికారిక ఆదేశాలు లేకున్నా పెరిగిన ప్రచారం**

ఓసీ లేకున్నా అదనపు టారిఫ్‌తో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారంటూ ఇటీవల అంతర్గత సమావేశాల సమాచారం బయటకు రావడంతో గ్రేటర్ వ్యాప్తంగా విపరీతమైన ప్రచారం జరిగింది. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడక ముందే ఈ ప్రచారం ఊపందుకోవడంతో, కనెక్షన్ల కోసం విద్యుత్ కార్యాలయాల వద్ద దరఖాస్తుదారుల క్యూ లైన్లు పెరిగిపోయి సెక్షన్ అధికారులపై ఒత్తిడి మరింత రెట్టింపైంది. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ యాజమాన్యం సమన్వయంతో స్పందించి ఈ ఓసీ సమస్యకు స్పష్టమైన పాలనాపరమైన పరిష్కారాన్ని చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# కొత్త డిజిటల్ వ్యవస్థతో ఆస్తులన్నీ ఒకే వేదికపై..!

మొదటిపేజీ తరువాయి

గుర్తించడం, లోపాలను విశ్లేషించడం, నిరంతరం పర్యవేక్షించడం సాధ్యమవుతోంది.

**హైదరాబాద్ మెట్రో జోన్‌లో తొలి దశ విజయవంతం**

ప్రస్తుతం హైదరాబాద్ కోర్ ప్రాంతంలో 33 కేవీ, 11 కేవీ లైన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, సెక్షనలైజర్లు, ఆటో రీక్లోజర్లు, ఫాల్ట్ పాసేజ్ ఇండికేటర్లు తదితర విద్యుత్ నెట్‌వర్క్ ఆస్తులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా జిఐఎస్ మ్యాపింగ్ చేస్తున్నారు. మొదటి దశలో హైదరాబాద్ మెట్రో జోన్ పరిధిలోని 27 ఈహెచ్‌టీఎస్ సబ్‌స్టేషన్లు, 156 సంఖ్యలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 266 సంఖ్యలో 33 కేవీ ఫీడర్లు, 988 సంఖ్యలో 11 కేవీ ఫీడర్ల జిఐఎస్ మ్యాపింగ్ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో రెండో దశ మ్యాపింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే కోర్ రీజన్ పరిధిలో నెట్‌వర్క్ మ్యాపింగ్ పూర్తి చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని మొత్తం విద్యుత్ నెట్‌వర్క్‌ను జిఐఎస్‌లోకి తీసుకురానున్నారు.

**కోటి మంది వినియోగదారుల సర్వీసులు అనుసంధానం**

ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా సుమారు ఒక కోటి మంది వినియోగదారుల విద్యుత్ సర్వీసులను సంబంధిత డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లతో అనుసంధానం చేస్తున్నారు. దీంతో వినియోగదారులు ఫిర్యాదు చేసిన వెంటనే వారి ఖచ్చితమైన స్థానాన్ని జిఐఎస్ మ్యాప్‌లో గుర్తించవచ్చు. అంతరాయం డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, 11 కేవీ ఫీడర్ లేదా సబ్‌స్టేషన్ స్థాయిలో ఎక్కడ ఏర్పడిందో కాల్ సెంటర్ ద్వారా స్పష్టమైన సమాచారాన్ని వినియోగదారులకు ఎప్పటికప్పుడు అందించవచ్చు. ఏ ఫీడర్ లేదా ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపం ఏర్పడినా ఎంతమంది వినియోగదారులు, ఏ ఏ ప్రాంతాలు ప్రభావితమయ్యాయో అధికారులు వెంటనే గుర్తించి తక్షణ చర్యలు చేపట్టగలరు. దీనివల్ల విద్యుత్ అంతరాయాల పరిష్కార సమయం తగ్గడంతో పాటు పారదర్శకత, వేగం పెరుగుతాయి. కొత్త విద్యుత్ కనెక్షన్లు, నిర్వహణ సేవలు కూడా మరింత త్వరగా అందుబాటులోకి వస్తాయి.



**డేటా ఆధారిత నిర్ణయాలు..**

టీజీఎన్ఎమ్ఎస్ వ్యవస్థ ద్వారా మొత్తం విద్యుత్ పంపిణీ వ్యవహారాన్ని ఒకే డిజిటల్ వేదికపై రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే సామర్థ్యం సంస్థకు ఏర్పడుతుంది. నెట్‌వర్క్ పనితీరును నిరంతరం విశ్లేషించడం ద్వారా లోపాలను ముందస్తుగానే గుర్తించడం, సాంకేతిక నష్టాలను తగ్గించడం, శాస్త్రీయ ప్రణాళికతో నెట్‌వర్క్ విస్తరణ చేపట్టడం సాధ్యమవుతుంది. ఫీల్డ్ సిబ్బందికి విద్యుత్ నెట్‌వర్క్ సమాచారం మొబైల్‌లోనే లభ్యమవ్వడం వల్ల ఫీల్డ్ తనిఖీల సమయం తగ్గి, మరమ్మతు పనుల్లో సమర్థత, భద్రత పెరుగుతాయి.

**దేశంలోనే అత్యాధునిక డిజిటల్ సంస్థగా తీర్చిదిద్దుతాం: సీఎండీ జితేష్ వి. పాటిల్**

'డిజిటల్ పాలన లక్ష్యాలకు అనుగుణంగా సాంకేతికతను ప్రజల సేవలో విస్తృతంగా వినియోగించడమే టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని సీఎండీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. సంపూర్ణంగా ఇన్ హౌస్‌గా అభివృద్ధి చేసిన టీజీఎనఎమ్ఎస్ ద్వారా విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వేగం, సామర్థ్యం గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు మరియు వినియోగదారుల సేవలను జిఐఎస్ ఆధారంగా అనుసంధానం చేసి టీజీఎస్‌పీడీసీఎల్‌ను దేశంలోనే అత్యాధునిక డిజిటల్ విద్యుత్ పంపిణీ సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. విశ్వసనీయమైన, నిరంతర విద్యుత్ సేవలను అందించడంలో టీజీఎన్ఎమ్ఎస్ వ్యవస్థ ఒక కీలక మైలురాయిగా నిలవనుందని చెప్పారు.

# ఎన్టీఏలో భారీ ప్రక్షాళన

న్యూఢిల్లీ, జూలై 24, సిరి న్యూస్:

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో పరీక్షల నిర్వహణ వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో భారీ ప్రక్షాళన చేపడుతూ 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. వారిలో కొందరిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు**

వచ్చే నెల రోజుల్లో ఎన్టీఏ వ్యవస్థలో విస్తృత మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడం, ప్రశ్నాపత్రాల లీకేజీకి ఆస్కారం లేకుండా పటిష్ఠ వ్యవస్థను రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

**అవుట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు**

ఎన్టీఏ అమలు చేస్తున్న అవుట్‌సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రశ్నాపత్రాల తయారీ, భద్రత, రవాణా, పంపిణీ ప్రక్రియలను మరింత కట్టుదిట్టం చేసే కొత్త విధానాలను అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో పేపర్ లీక్‌లకు అవకాశం లేకుండా సాంకేతిక, పరిపాలనా పరమైన భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయనున్నారు.

**నిపుణుల కమిటీతో సమీక్ష**

ఎన్టీఏ పనితీరును సమగ్రంగా సమీక్షించి, సంస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్టీఏ నీట్, జేఈఈ, సీయూఈటీతో పాటు 20కిపైగా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈ సంస్కరణలు దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణ విధానంపై కీలక ప్రభావం చూపనున్నాయని విద్యారంగ వర్గాలు భావిస్తున్నాయి.

# వెయ్యి కోట్ల సైబర్ మోసంపై సిట్

హైదరాబాద్, జూలై 24, సిరి న్యూస్:

ఖమ్మం జిల్లాలో వెలుగుచూసిన వెయ్యి కోట్ల రూపాయల ఫైబర్ చీటింగ్, సైబర్ మోసాల కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భారీ మోసంపై దర్యాప్తు బాధ్యతలను సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అప్పగించగా, డీఎస్పీ కె.వి. మురళీధర ప్రసాద్ నేతృత్వంలోని బృందం విచారణను చేపట్టింది.

**రెండు కీలక కేసులు సిట్ ఆధీనంలోకి**

ఖమ్మం జిల్లా పరిధిలోని వి.ఎం. బంజారా, సత్తుపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను సైబర్ సెక్యూరిటీ బ్యూరో తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ కేసుల ఆధారంగా కొత్తగా కేసు నమోదు చేసి విస్తృత దర్యాప్తు ప్రారంభించింది. ప్రతి వారం విచారణ పురోగతిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని డీజీపీ ఆదేశించినట్లు సమాచారం. విదేశీ సంబంధాలు, అంతర్రాష్ట్ర మనీలాండరింగ్, బ్యాంకు లావాదేవీల కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

**నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్న మోసం**

ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పేరుతో నిరుద్యోగులు, అమాయకులను నమ్మించి నిందితులు భారీ మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల పేర్లపై వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, వాటి ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలను తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల ద్వారా సమకూరిన రూ.1,000 కోట్లకు పైగా నిధులను ఈ ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు.

**నిందితుల నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా**

ఈ కేసులో పోత్రు ప్రవీణ్ ప్రధాన నిందితుడిగా గుర్తించిన అధికారులు, పొత్రు కళ్యాణ్, మోరంపూడి చెన్నకేశవరావు, జన్ను నూరి శివకృష్ణ, ఉడుతనేని వికాస్ తదితరులను కూడా నిందితులుగా చేర్చారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులకు సహకరించిన వ్యక్తులు, బోగస్ కంపెనీలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్ పాత్రపైనా సిట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ ఈ భారీ సైబర్ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.



# భద్రాద్రిలో 1870 మెగావాట్ల ఉత్పత్తిని ఆపేశారు

ఆలేరు, జూలై 24, సిరి న్యూస్:

ఆలేరు నియోజకవర్గం, బొమ్మలరామారం మండలంలోని సోలేపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వున్నారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ లాగ్ బుక్‌ను చెక్ చేసి, రైతులకు రోజుకు ఎన్ని గంటల కరెంట్ సప్లై చేస్తున్నారనే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిరోజూ రైతులకు అంతరాయం లేకుండా 24 గంటల విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, పొలాలకు సాగునీరు అందించింది. బొమ్మలరామారంలో చనిపోయిన బీఆర్ ఎస్ కార్యకర్తను పరామర్శించడానికి వస్తే.. ఇక్కడి మహిళలు రెండు రోజులకు ఒకసారే నల్లా నీళ్లు వస్తున్నాయని తమ బాధలు చెప్పుకుంటున్నారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాగా కేసీఆర్ గారు మిషన్ భగీరథ ద్వారా ఐదేళ్ల పాటు రాష్ట్రమంతా నీళ్లు ఇస్తే.. ఉన్న వ్యవస్థను నడపడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. మిషన్ భగీరథను సరిగ్గా నడిపితే ఆ పేరు బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ గారికి వస్తుందనే అక్కసుతోనే కావాలని నీళ్లు ఇవ్వడం లేదా. సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, కామారెడ్డి, యాదాద్రి, నల్గొండ, మహబూబ్ నగర్.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్ళీ బిందెలు పట్టుకుని మహిళలు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి కనబడుతోంది. మీరు తెస్తామన్న ఆనాటి రోజులు అంటే ఇవేనా? కరెంటు కోసం, ఎరువుల కోసం రైతులు ధర్నాలు చేయడం, తరుగు తీయడమేనా మీ మార్పు. రైతులు కరెంటు కోసం ఇబ్బంది పడుతున్నారని సోదరి సునీత గారు చెబితే ఈరోజు సోలేపేట సబ్‌స్టేషన్‌కు సర్ ప్రైజ్ విజిట్‌కి వచ్చాం. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ని అడిగితే.. మొన్నటి దాకా 1415 గంటలు ఇచ్చాం సార్, ఈ వారం నుంచి కేవలం 12 గంటలే ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి అని చెబుతున్నాడు. ప్రభుత్వం ఇస్తున్న ఆ 12 గంటల కరెంటులో కూడా రెండు మూడు సార్లు ట్రిప్ అవుతోంది. 24 గంటల కరెంటుకు రైతాంగాన్ని ఎందుకు దూరం చేస్తున్నారు? కరెంటుకు మేమే పేటెంట్ అని రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతున్నారు.. మీ పేటెంట్ అంటే ఉచిత కరెంటును ఉత్త కరెంటు చేయడమేనా? నారుమళ్లు పోసుకునే, నాట్లు వేసుకునే ఈ కీలక సమయంలో నీళ్లు చాలా అవసరం. కరెంటు ఇవ్వకపోవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గం తిప్పర్తి మండలంలో, జగిత్యాల జిల్లా ఐలాపూర్, బాల్కొండ, కోహీర్ మండలం దిగ్వాల్, సిద్ధిపేట జిల్లా కాజీపూర్, సిరిసిల్ల జిల్లా నిజామాబాద్ సబ్‌స్టేషన్ల ముందు కేసీఆర్ 23,000 మెగావాట్ల విద్యుత్ స్థాపిత సామర్థ్యంతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారు. ఇప్పుడు రాష్ట్రంలో 15,000 మెగావాట్ల లోడు కూడా లేదు, ఎండాకాలం కూడా కాదు.. అయినా రైతులకు ఎందుకు కోతలు పెడుతున్నారు. కోతలు పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యమా. ఎన్నికల ముందు 4000 పెన్షన్, 15000 రైతుబంధు, మహిళలకు 2500, విద్యార్థి భరోసా అంటూ మాటల కోతలు కోశారు. ఇప్పుడేమో కరెంటు, బోనస్, కేసీఆర్ కిట్, గొర్రెలు,చేపల పంపిణీ, రైతు బీమాలలో కోతలు పెడుతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మొన్న వరంగల్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంట్ కోతలే లేవని చెప్పారు. మరి ఈరోజు నేను సోలేపేట సబ్‌స్టేషన్ రికార్డులు చూస్తే 12 గంటల కరెంటే ఇస్తున్నారు.. భట్టి గారు దీనికి ఏం సమాధానం చెబుతారు. రాష్ట్రంలో 1011 గంటల కరెంటే వస్తోంది. మీ మాటలు గడప దాటుతున్నాయి కానీ మీ పనులు గడప దాటడం లేదు. మీరు నిజంగా కడుపు నిండా 24 గంటల కరెంటు ఇస్తే రైతులు ఎందుకు సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల, బొగ్గు నిల్వలు లేకపోవడం వల్ల కేసీఆర్ గారు నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 1600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు మూతపడి నెలలు గడుస్తోంది. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కూడా 270 మెగావాట్ల యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. సింగరేణి మన చేతిలోనే ఉన్నప్పటికీ 1870 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఎందుకు ఆగిపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. రైతులకు ఫ్రీ కరెంటు ఇస్తే పైసలు రావని, కరెంటు ఉత్పత్తి ఆపేసి రైతులకు కోతలు పెడుతున్నారా? కరెంటు లేక కాదు.. రేవంత్ రెడ్డికి మనసు లేక కరెంటు రావడం లేదు. రైతులకు మూడు గంటల కరెంటు చాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారు, ఇప్పుడు ఆ మాటనే నిజం చేయదలుచుకున్నారా? హైదరాబాద్ ప్రజలకు ఎలాగైతే 24 గంటల కరెంటు వస్తుందో, బాయికాడ రైతుకు కూడా 24 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలన్నదే బీఆర్ఎస్ పాలసీ. బీఆర్ఎస్ ముల్లు గర్రతో పొడిస్తే తప్ప ఈ ప్రభుత్వం కదలడం లేదు. దేవాదుల మోటార్లు ఆన్ చేయాలని మేము ప్రశ్నిస్తే తప్ప, నిద్రలేచి 5 నుంచి 9 మోటార్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాం.. యాదాద్రి, భద్రాద్రిలో ఆగిపోయిన 1870 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని వెంటనే ప్రారంభించి, రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి. కరువు పరిస్థితుల్లో బోర్లు అడుగంటిపోయినప్పుడు రైతులకు కరెంటు అవసరం చాలా ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథపై వెంటనే రివ్యూ చేసి, ప్రతిరోజూ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం.మండలంలో వ్యవసాయ అధికారిని అడిగితే ఒక్క బొమ్మలరామారం మండలంలోనే 10 రైతు బీమాలు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. దురదృష్టవశాత్తు రైతు చనిపోతే వారం రోజుల్లో 5 లక్షలు ఇచ్చేలా కేసీఆర్ రైతు బీమా తెస్తే.. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా 4000 మంది రైతులకు బీమా డబ్బులు ఐదు నెలలుగా రావడం లేదు. రైతుబంధు ఎగ్గొట్టారు, యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ సగం ఎగ్గొట్టారు..

# జెన్ జీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నిలదీయండి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధులు సీహెచ్. విఠల్, జె.సంగప్ప తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జెన్ జీ తరం పిల్లల్లారా.. బీఆర్ఎస్ అంటేనే పేపర్ లీకేజీలు, పశ్నాపత్రాలు అమ్ముకుని దోచుకున్నరు.. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలోనూ అదే జరిగింది. ఆ రెండు పార్టీలను నిలదీయండి అని పిలుపునిచ్చారు. నిరసనలు, ధర్నాలను నిషేధిస్తూ ధర్నా చౌక్‌నే ఎత్తేసిన బీఆర్ఎస్ నేతలు ఇయాల సిగ్గు లేకుండా అదే ధర్నా చౌక్‌లో నిరసన చేశారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ పేరుతో జరిగిన నిరసనలో కమ్యూనిస్టు, కమ్యూనల్ పార్టీలు చొరబడి హింసను సృష్టించడమే కాక పార్లమెంటుపై దాడికి యత్నించాయని మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశం.. అందరికంటే ఎక్కువగా ప్రధాని మోదీ బాధపడుతున్నారని చెప్పారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని, సీబీఐ ఇప్పటికే 11మంది ఫ్యాకల్టీసహా 17 మందిని అరెస్టు చేసిందని తెలిపారు. విద్యార్థులు ఆందోళనను అర్థం చేసుకున్నాం.. విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణ చెప్పారు.. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనలో పోలీసులు, జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులపై దాడులతో ఆందోళనకారులు అసభ్యంగా ప్రవర్తించారని, పోలీసుల తలలు పగిలినా ఫైరింగ్ చేయలేదని చెప్పారు. 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని, విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరి లాఠీఛా□ర్జి చేయాల్సి వచ్చిందని అన్నారు. పాకిస్తాన్ నుండి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని, అందుకే పాకిస్తాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని చెప్పారు. నీట్‌కు.. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి? నీట్‌కు ఆజాద్ కాశ్మీర్‌కు సంబంధం ఏమిటి.. నీట్‌కు బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి అని సంజj పశ్నించారు. విపక్షాలు పార్లమెంటులో ఎందుకు చర్చలకు సిద్ధంగా లేవని నిలదీశారు. నీట్ పేపర్ లీకై రెండు నెలలు దాటినా కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఏనాడూ పెదవి విప్పలేదని, కాక్రోచ్ పార్టీ ధర్నాలతో మొన్న అకస్మాత్తుగా పీఎం ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ కుట్ర చేసిందని అన్నారు.. మోదీని దించి రాహుల్‌ను పీఎం చేయాలన్నదే వాళ్ల ఏకైక లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో 72 సార్లు పేపర్లు లీకైనయ్.. మరి ఆనాడు మన్మోహన్ సింగ్, విద్యాశాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయలేదు.. ఇక రాజస్తాన్, పంజాబ్, కేరళ, కర్నాటక, య□పీ, బెంగాల్‌ల లో ప్రశ్న పత్రాలు లీక్ అయితే ఆయా బాధ్యులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. అశోక్ గెహ్లాట్ సీఎంగా ఉండగా 18సార్లు పేపర్లు లీక్ అయితే ఆనాడు రాహుల్ , ప్రియాంక ఏమన్నారో దేశమంతా చూసిందంటూ కాంగ్రెస్ చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారమా అని అడిగారు. తాను రాష్ట్రంలో గ్రూప్1 పేపర్ లీక్‌పై పోరాటం చేస్తుంటే ఏమైందో మీరే చూశారన్నారు. కాగా, కేటీఆర్‌కు 50వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ కనీసం పుట్టిన రోజున కూడా నిజాలు చెప్పలేదని ఎద్దేవా చేశారు. ట్విట్టర్ టిల్లు బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జి చేయించిన ఘటన మర్చిపోగలమా అన్నారు.అపుడు ఎందుకు రాజీనామా చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. పేపర్ లీక్‌పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు సుద్దపూసను తలపిస్తున్నాయని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలోనే టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీకైందని, గ్రూప్1లో అక్రమాలు జరిగి నాలుగు లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తు నాశనమైందని, మరి ఆనాడు మీరెందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. మొన్న 'నీట్'లో ర్యాంకులు సాధించిన గురుకుల విద్యార్థులందరినీ పిలిచి సన్మానం చేసినవ్.. వారిని అడుగు.. 'నీట' ఎట్లా జరిగిందో చెబుతారన్నారు. గ్లోబరీనా గురించి మాట్లాడుతున్న సీఎం ఆ నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదన్నారు. విద్యార్థులారా కుటిల రాజకీయ నేతల ట్రాప్‌లో పడకండి.. మెడికల్ కౌన్సెలింగ్‌కు సిద్ధం కండి అని పిలుపునిచ్చారు.

# ప్రైవేటు సంస్థలకు దీటుగా రాణించాలి

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. అంతకుముందు మణుగూరు ఓపెన్ కాస్ట్ మైనింగ్ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గనిలోకి వెళ్లి బొగ్గును స్వయంగా చేతిలోకి తీసుకుని దాని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడంతో సంస్థవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు సంతోషంగా సంబరాలు జరుపుకున్నారని ఉప ముఖ్యమంత్రికి అధికారులు చెప్పారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ఆయన పరిశీలించి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్న బొగ్గు వివరాలను, భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టు 4X270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని, నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీంతో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా సునిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు శుద్ధీకరణను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేకపోయిందని ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. సింగరేణి అనేది ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు.. వేలాదిమంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో చర్చలు ప్రారంభించాలని, సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్తు అవసరాలు, ఉత్పత్తి లక్ష్యాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ ను కూడా సింగరేణికే కేటాయించేలా ప్రభుత్వం చొరవ చూపాలని అధికారులు ఉప ముఖ్యమంత్రికి కోరారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే పదేళ్ల రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరి టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# సైబర్ నేరాల కట్టడికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్

హైదరాబాద్, జూలై 24, సిరి న్యూస్:

పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే తెలంగాణ పోలీసులు సాంకేతికతలో ఎప్పటికప్పుడు ముందుండాలని డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సైబర్ భద్రత ప్రమాణాల్లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరిచి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించేలా అన్ని పోలీసు యూనిట్లు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, సైబర్ సెక్యూరిటీ, ఈజీరో ఎఫ్ఐఆర్ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన మంత్రి ప్రగతి వేదిక ద్వారా దేశవ్యాప్తంగా కీలక ప్రాజెక్టులు, పాలనకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాలు, ముఖ్యంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ రాష్ట్రాల సైబర్ భద్రత పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తోందని డీజీపీ తెలిపారు. మొత్తం తొమ్మిది కీలక పనితీరు సూచికల ఆధారంగా రాష్ట్రాలకు జాతీయ ర్యాంకులు కేటాయిస్తారని, ఆ అన్ని అంశాల్లో తెలంగాణ పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేసి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించాలని సూచించారు. రాష్ట్రంలో ఈజీరో ఎఫ్ఐఆర్ వ్యవస్థ అమలు ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉందని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి యూనిట్ ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తెలంగాణ జాతీయ స్థాయిలో వెనుకబడిన విభాగాల్లో పనితీరును మరింత మెరుగుపరచాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్న డీజీపీ, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలతో పాటు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. సాంకేతిక ఆధారిత దర్యాప్తు విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల దర్యాప్తుతో పాటు సాధారణ పోలీసింగ్‌లో కూడా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ను పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ సాయి శ్రీ తో పాటు రాష్ట్రంలోని వివిధ పోలీసు యూనిట్ల సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

హైదరాబాద్,జూలై24, సిరి న్యూస్:

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నిర్వహణపై కేంద్రానికి లేఖ రాయాలి

మొదటిపేజీ తరువాయి



రంగారెడ్డి ఎత్తిపోతల పురోగతిపై శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను ఫ్రీఫ్లో(నీటి నిల్వ లేకుండా) విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాక అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస‌ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫొటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జత చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను నీటి నిల్వకు, పంపింగ్‌కు ఎందుకు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా ఆదేశించారు. ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, ఆ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ ఎన్‌డీఎస‌ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని సమీక్ష సందర్భంగా అధికారులు వివరించారు. మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస‌ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.

**అన్నారం ర్యాఫ్ట్ ఫౌండేషన్‌లోనూ సాంకేతిక సమస్యల సంకేతాలు**

సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని అధికారులు తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయన్నారు. అనంతరం వాటిని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ ముందుంచాలని మంత్రి ఆదేశించారు.

**కనిపించే నీరు ఒక్కటే ప్రామాణికం కాదు**

ప్రస్తుత వర్షాకాలంలో పంపింగ్ కార్యకలాపాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కేవలం దిగువకు నీరు ప్రవహిస్తున్నందుకే పంపింగ్ సాధ్యమవుతుందని భావించడం సరికాదని అధికారులు స్పష్టం చేశారు. పంపింగ్‌కు అవసరమైన అప్‌స్ట్రీమ్ నీటి మట్టం ప్రస్తుతం కొనసాగించే పరిస్థితి లేదని, తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల ఫలితం లేకపోవడమే కాక బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయం.. ప్రతి నిర్ణయం శాస్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల మీదే ఆధారపడి ఉంటుంది.. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమీక్ష పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి కేటాయింపులు, ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో ప్రస్తుతం డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రాసెసింగ్ ముందుకు సాగడం లేదని అధికారులు వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

హైదరాబాద్, జూలై24, సిరి న్యూస్:

బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్ధాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

# ఆరోగ్య శాఖకు ₹740 కోట్లు విడుదల!

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల మార్గదర్శకత్వంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,569 నూతన ఆరోగ్య ఉప కేంద్రాల (సబ్ సెంటర్లు) భవన నిర్మాణాలను చేపట్టనున్నారు. అంతేకాకుండా, సాధారణ వైద్య పరీక్షల కోసం గ్రామీణ ప్రజలు ఇకపై పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఉచిత నిర్ధారణ (డయాగ్నోస్టిక్) సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రాథమిక ఆరోగ్య స్థాయిలోనే వ్యాధులను త్వరగా గుర్తించి సత్వర చికిత్స అందించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు అయ్యే వైద్య ఖర్చుల భారాన్ని ప్రభుత్వం గణనీయంగా తగ్గించనుంది. వైద్యాన్ని పేద ప్రజల హక్కుగా మారుస్తూ, పల్లెల్లో ఆరోగ్య రంగానికి ప్రజా ప్రభుత్వం కొత్త ఊపిరి పోస్తున్నది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామీణ స్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా వైద్య సేవల అందుబాటు, నాణ్యత గణనీయంగా పెరగనున్నాయి.

# మోదీజీ మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు!

మొదటిపేజీ తరువాయి

అన్నారు. సీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు నీట్ పేపర్ల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరం మారుతున్నది, నవతరం మారుతున్నది అని కేంద్రం తెలుసుకోవాలి. శ్రీలంకలో ఈ యువతరం ఉరికించి ప్రభుత్వాలను పాతరేసింది. అలాంటి యువతరంతో పెట్టుకోవద్దని ఆయన హెచ్చరించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతరాన్ని తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే విద్యార్థుల వద్దకు వెళ్లి ఇప్పటికే అనేకసార్లు చర్చలు చేసి సమస్యలు పరిష్కరించాల్సి ఉండే. ఈ యువతరం ఈ జనరేషన్ సిబిఐ, ఈడి, ఐటిలకు భయపడేది కాదు అని మోడీ తెలుసుకోవాలి.తెలంగాణ యువతతో పాటు దేశం యువత ఆగ్రహంతో ఉన్నారు. పొట్టు పొట్టు కోపంగా ఉన్నారు. నిన్ను నీ ప్రభుత్వాన్ని మెట్టు మెట్టు ఎక్కి తొక్కుతారు. ఈ విషయాన్ని మోడీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. యువతరానికి ఏ రాజకీయ నాయకుడి అండ లేదు. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో వేలాదిమంది తరలి వస్తున్నారు. యువతరం ఆందోళన ఆగ్రహం కేవలం పేపర్ లీక్ కి సంబంధించిందే కాదు. 12 ఏళ్లుగా కేంద్రం చేస్తున్న మోసాలు, ద్రోహాల పైన ఆగ్రహం.అసలు పని చేయకుండా కేవలం మతం పేరుతో తప్పించుకుంటున్న తీరుని యువతరం అర్థం చేసుకున్నది. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ 24 కోట్ల ఉద్యోగాలు ఇయ్యలేనందుకే యువతరం ఈరోజు బయటకు వచ్చింది. మేకిన్ ఇండియా అడిగితే లీకిన్ ఇండియా బీజేపీ ఇచ్చింది. విద్యార్థులు యువతరం కేంద్రం నుంచి జవాబుదారితనాన్ని అడుగుతున్నది.

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తప్పైందా అని యువతరం అడుగుతున్నది, నిలదీస్తున్నది. ఈరోజు చేపట్టిన నిరసనలో ఎలాంటి రాజకీయాలు లేవు. విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని చూడలేకనే ప్రజాప్రతినిధులుగా, నాయకులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటం చేసి తెలంగాణ సాధించిన ఉద్యమ పార్టీగా విద్యార్థుల ఉద్యమానికి అండగా ఉండాలనుకున్నాం. పార్టీల జెండాలు, ఎజెండాలతో వారి ఉద్యమానికి కలుషితం చేయవద్దు. కానీ వారికి అండగా ఉండాల్సిన అవసరం ఉన్నది. విద్యార్థులు ఒక్కరే కాదు వారందరికీ మనమంతా అండగా ఉన్నామని చెప్పాల్సిన అవసరం ఉన్నది. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాష్టికాన్ని అణచివేతను చూస్తే ఎవరి మనసైనా కరగాల్సిందే. వాళ్ళు అడిగిన దాంట్లో అన్యాయం ఏమున్నది? వాళ్ళు అడిగింది కేవలం తమకు న్యాయం చేయమని తమ భవిష్యత్తును కాపాడమని. యువతరం ప్రధానమంత్రి కుర్చీ అడిగిందా? కేంద్రమంత్రి కుర్చీ అడిగిందా? నీట్ పరీక్షా పత్రం పేపర్ లీక్ తో పాటు విద్యారంగంలో సంస్కరణ రావాలని సోనమ్ వాంగ్‌చుక్ నిరసనకు కూర్చున్నారు. మీడియా మద్దతు లేకున్నా సోషల్ మీడియా తోనే జెన్ జీ యువతరం దేశం మొత్తాన్ని కదిలించింది. ఇదే తెలంగాణ గడ్డ నుంచి 50 ఏళ్ల కింద జీనా హై తో మర్నాసికో కదం కదం పర్ లడ్నాసికో అని ఒక యువకుడు పిలుపునిచ్చిండు. ఆ స్ఫూర్తితో తెలంగాణ యువత, దేశ యువత గట్టిగా కొట్లాడుతున్నది. దేశంలోని ఆడబిడ్డలను పోలీసులు తీవ్రంగా దాడి చేస్తున్నారు. కొట్టకూడని చోట కొడుతున్నారు. విద్యార్థులకు యువతకు సంఘీభవంగా రాజకీయాలతో సంబంధం లేకుండా మా పార్టీ సంఘీభావం తెలిపింది ఈరోజు. విద్యార్థులు కోరుతున్నట్లుగా ధర్మేంద్ర ప్రధాన్‌ని రాజీనామా చేయించాలి. విద్యార్థులపై పెట్టిన పోలీసు కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. విద్యార్థులపై చేసిన దాష్టీకానికి అక్రమ కేసుల నమోదుకు క్షమాపణ చెప్పాలి. దేశంలో కేంద్ర మంత్రుల కొడుకులు రేపులు చేస్తే వెంటనే బెయిల్ వస్తున్నాయి కానీ పేపర్ లీకుల పైన ఎంత అడిగినా సమాధానం మాత్రం ఎందుకు రావడం లేదు. ఏ దేశం కోసం? ఏ ధర్మం కోసం? పేపర్ లీకుల పైన సమాధానం చెప్పడం లేదు. భారతీయ జనతా పార్టీ నాయకులు చెప్పాలి. అడగవలసిన అవసరం ఉన్నది, నిలదీయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**మోదీ తప్పు చేశాడంటే రేవంత్‌కు ఎందుకు కోపం?**

హైదరాబాద్, ప్రజాతంత్ర, జూలై 24: మోడీ పైన నేను కొట్లాడితే రేవంత్ రెడ్డి అనే కేడీకి ఎందుకు కోపం వచ్చింది? మోడీ తప్పు చేసిండు అంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కోపం? మోడీని ప్రశ్నిస్తే యూత్ కాంగ్రెస్ ని ఎందుకు పంపించి నన్ను అడ్డుకుంటున్నాడు రేవంత్ రెడ్డి చెప్పాలి. రాహుల్ గాంధీ ఢిల్లీలో కొట్లాడితే కొడంగల్లో పోయి రేవంత్ రెడ్డి దాక్కున్నాడు. నల్లమల్ల పిల్లి వోయి కొడంగల్లో దాక్కున్నది. రేవంత్ రెడ్డి కూతురునో, మనవడినో ఢిల్లీలో పిల్లల్ని కొట్టినట్లు కొడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా? ఢిల్లీ దాకా వెళ్లి మీ నాయకుడితో కూర్చుండి నిరసించే ధైర్యం కూడా రేవంత్ రెడ్డికి లేదు. దేశమంతా నరేంద్ర మోడీని ధర్మేంద్ర ప్రధాన్‌ని ప్రశ్నిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్, కేటీఆర్ ని విమర్శిస్తున్నాడు. మేము మాట్లాడుతుంటే మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నాడు రేవంత్ రెడ్డి చెప్పాలి. ఢిల్లీని వణికించి తెలంగాణ తెచ్చిన పార్టీ మాది. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి గడగడలాడించి అయినా విద్యార్థుల వెంట నిలబడతాం. నీకు ఎలాగూ ఢిల్లీని ప్రశ్నించే ధైర్యం లేదు రేవంత్ రెడ్డి. మమ్మల్ని ఎందుకు ఆపుతున్నాడో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

# లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు హెచ్చరిక

హైదరాబాద్, జూలై 24, సిరి న్యూస్:

హైదరాబాద్‌లోని లోతుకుంట భూముల వివాదంపై తెలంగాణ హైకోర్టులో జరిగిన విచారణలో హైడ్రా అధికారుల తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా వ్యవహరించిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వైఖరిపైనా ప్రశ్నలు లేవనెత్తింది. హైడ్రా తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టులో హాజరై వాదనలు వినిపించారు.

**కోర్టు ఉత్తర్వులను ఎందుకు పాటించలేదు?**

విచారణ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు సంబంధించిన చట్టాలను పక్కనబెట్టి కేవలం హైడ్రా చట్టం ప్రకారమే వ్యవహరిస్తున్నారా అని ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించడం హైడ్రాకు అలవాటుగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఒకే భూమికి సంబంధించిన మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లలో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడం అసాధారణ పరిణామమని పేర్కొంది.

**ధిక్కరణపై తీవ్ర అభ్యంతరం**

కోర్టు ధిక్కరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించకుండా, అదే భూమిలోకి మళ్లీ వెళ్లడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని హైకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఒక ఫిర్యాదు ఆధారంగా న్యాయస్థానం ఆదేశాలను విస్మరించి భూమిలోకి ప్రవేశించడం ఎలా సమర్థనీయమవుతుందని అధికారులను ప్రశ్నించింది.

**కమిషనర్‌కు అఫిడవిట్ ఆదేశం**

ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసేందుకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గడువు కోరగా, హైకోర్టు అంగీకరించింది. అయితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా క్షమాపణలు తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## చిన్నారుల కేరింతలు కేటీఆర్ జన్మదిన వేడుకలు



- ఆశ్రమం వేదికగా ఆత్మీయ దృశ్యాలు
- రుష్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు

**అమీన్పూర్ జులై 24 సిరి న్యూస్**

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని మహిమ మినిస్ట్రీస్ అనాధ ఆశ్రమంలో డివిజన్ బిఆర్ఎస్ యువ నాయకులు రుష్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధినేత బాటలోనే యువ నాయకత్వం సేవా కార్యక్రమాలతో కేటీఆర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచిన అని అన్నారు. అనాధల ఆకలి తీర్చి చిరునవ్వులు పూయించి కేక్ కటింగ్ తో కేటీఆర్ పై ప్రేమాభిమానాలను చాటుకున్న అని తెలిపారు ఈ కార్యక్రమంలో యువత తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి పై అవగాహన



**తూప్రాన్ జులై 24 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ మండల పరిధిలోని వివిధ శాఖలలో పని చేసే అధికారులతో శుక్రవారం జల్ సంచయ్ జన భాగీదారి–3.0"పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మున్సిపల్ కార్యక్రమంలో వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు అమూల్యమైనది నేడు వర్షపు నీటిని సంరక్షిస్తే రేపటి తరాలకు తాగునీటి సౌకర్యాలను అందించగలం అని ప్రతి ఇంటిలో ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యా వాణిజ్య సంస్థల్లో రూఫ్టాప్ రేన్వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు ఐవర్షపు నీటి సంరక్షణ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి బోరు బావులలో నీరు సమృద్ధిగా లభిస్తాయని భవిష్యత్లో నీటి కొరతను నివారించవచ్చని అదేవిధంగా వర్షపు నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతలు, రీచార్జ్ పిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా కృషి చేయాలని ప్రజల భాగస్వామ్యంతోనే జల్ జన భాగీదారి–3.0 కార్యక్రమం విజయవంతమవుతుందని నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా ముందుకు సాగాలని ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టుదాం భవిష్యత్ తరాలకు జలభద్రతను అందిద్దాం అని కమిషనర్ రమేష్ కుమార్ కోరారు

## కొండాపూర్ మండలంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**(సిరి న్యూస్ )కొండాపూర్, జూలై 24:**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను కొండాపూర్ మండలంలోని సీహెచ్ కోనాపూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని జేపీఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేటీఆర్ చిత్రపటం ముందు కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. కేటీఆర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.జైరాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విఠల్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్లు మహేష్, కృష్ణ, మాజీ సర్పంచ్లు ప్రకాష్,జగదీశ్,జిల్లా నాయకులు లక్ష్మా రెడ్డి, మల్లా గౌడ్, కృష్ణమూర్తి, నక్కా నాగరాజు గౌడ్, గోవర్ధన్ రెడ్డి, ప్రేమానందం,శాంతయ్య, వసంత్, తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల హక్కుల కోసం పటాన్చెరు యువశక్తి కదిలింది..





- జీఎంఆర్ నేతృత్వంలో హైదరాబాద్కు భారీ ర్యాలీ
- ధర్నా చౌక్లో నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిన విద్యార్థులు, యువత

**పటాన్చెరు, జూలై 24 (సిరి న్యూస్):**

విద్యార్థుల సమస్యల పరిష్కారం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్లోని ధర్నా చౌక్లో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పటాన్చెరు నుంచి భారీగా విద్యార్థులు, యువత తరలివెళ్లారు. పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) నేతృత్వంలో 300కు పైగా కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరి నిరసనలో పాల్గొన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ధర్నా చౌక్లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. నీట్ సహా పలు పోటీ పరీక్షల నిర్వహణలో నెలకొన్న లోపాల వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై దమనకాండకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న ప్రతి పోరాటానికి భారత రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల కోసం ఎదురు చూడలేదు..





- తన పని కాకున్నా, మానవత్వంతో ముందుకు వచ్చాడు..
- స్వయంగా రోడ్డుగుంతలు పూడ్చిన ఆటో డ్రైవర్ సందీప్.

**రామాయంపేట, జూలై 24 (సిరి న్యూస్)**

సమాజం ఎటు పోతే మనకెందుకులే... మనం బాగుంటే చాలు... అనుకుంటున్న రోజులు ఇవి.. అయితే ఇదుకు పూర్తి భిన్నంగా ఒక ఆటో డ్రైవర్ తన పని కాకున్న, బాధ్యత తీసుకొని సమాజానికి ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే... సమాజం పట్ల బాధ్యత ఉంటే ఒక్క వ్యక్తి కూడా మార్పుకు శ్రీకారం చుట్టగలడని రామాయంపేట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ సందీప్ నిరూపించాడు. లక్ష్మాపూర్ నుంచి దంతేపల్లి వరకు ఉన్న రహదారిపై భారీ గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో, అధికారుల స్పందన కోసం వేచి చూడకుండా స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టాడు. తన ఆటోలో కంకర, మట్టిని తీసుకువచ్చి రోడ్డులోని గుంతలను స్వయంగా పూడ్చి వాహనదారులకు సురక్షిత ప్రయాణం కల్పించే ప్రయత్నం



చేశాడు. చాలా కాలంగా గుంతల వల్ల పలువురు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారని, ప్రజల ఇబ్బందులు చూసి చలించిపోయి ఈ పని చేపట్టినట్లు ఆటో డ్రైవర్ సందీప్ తెలిపారు. ఆటో డ్రైవర్ సేవాభావాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. సమాజం కోసం బాధ్యతతో ముందుకొచ్చిన ఆయన చర్య ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడుతున్నారు. ఇదే సమయంలో సంబంధిత అధికారులు వెంటనే రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి

- తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలి
- నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, జూలై 24 (సిరి న్యూస్):**



ఎల్నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్లో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను ఆగస్టు నెలాఖరులోగా అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏకరూప దుస్తుల పంపిణీ, ఎల్నినో ప్రభావం, ఖరీఫ్ పంటల సాగుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా విత్తన మేళాలు నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని సీఎస్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనిఫాంల కుట్టింపునకు అవసరమైన వస్త్రాలు, సామగ్రిని సకాలంలో అందించి, విద్యార్థులకు ఎలాంటి జాప్యం లేకుండా దుస్తులు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. క్రాప్ డైవర్సిఫికేషన్కు తగిన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, భూగర్భ జలాలు తగ్గిన ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పండుగలా కేటీఆర్ జన్మదినం

### మాజీ చైర్మన్ నందారం నేతృత్వంలో జోరుగా వేడుకలు

**అమీన్పూర్ జులై 24 సిరి న్యూస్**

అమీన్పూర్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

**కేక్ కటింగ్ మిఠాయిల పంపిణీ**

నందారం నరసింహ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య భారీ కేక్ కట్ చేశారు అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఐటి పారిశ్రామిక రంగాల ప్రగతిలో కేటీఆర్ చూపిన చొరవ అభినందనీయమని ఆయన కొనియాడారు. బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# పోలీసు సిబ్బందికి కంప్యూటర్ వృత్తి నైపుణ్యాలు

- ముగిసిన రెండో బ్యాచ్ శిక్షణా కార్యక్రమం
- ఆధునిక సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించడమే లక్ష్యం
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి
- శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి సర్టిఫికెట్ల అందజేత




**సంగారెడ్డి, జూలై 24 (సిరి న్యూస్):**

జిల్లా పోలీసు సిబ్బందిలో వృత్తిరిత్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోక్సెన్ యూనివర్సిటీ నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరమని సంగారెడ్డి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపీఎస్ పేర్కొన్నారు. రెండవ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పూర్తిచేసుకున్న పోలీసు సిబ్బందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విస్తృతమవుతున్న నేపథ్యంలో సిబ్బంది ఆధునిక సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించడం అత్యంత అవసరమని తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, ముఖ్యంగా వర్డ్, ఎక్సెల్ వంటి సాఫ్ట్‌వేర్‌లలో ప్రావీణ్యం పెరగడం ద్వారా కార్యాలయ పనితీరులో వేగం, ఖచ్చితత్వం, సమర్థత మరింత మెరుగుపడుతాయని పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్, టెక్ టీమ్ సిబ్బంది కోసం మొత్తం 180 మందిని 3 బ్యాచ్‌లుగా విభజించి, ప్రతి బ్యాచ్‌కు 3 రోజుల చొప్పున ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు శాఖలో సేవల నాణ్యతను పెంచడంలో ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ డీన్ డా. దయాశంకర్, అసిస్టెంట్ డీన్స్, ప్రొఫెసర్లు, జిల్లా పోలీసు అధికారులు మరియు శిక్షణ పొందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో ఘనంగా కే.టీ.ఆర్ జన్మదిన వేడుకలు

- రోగులకు, ఫుట్ పాత్ వ్యాపారులకు పండ్లు, గొడుగుల పంపిణీ.
- టిఆర్ఎస్ నేత చౌదరి సుప్రభాత రావు ఆధ్వర్యంలో





**రామాయంపేట, జూలై 24 (సిరి న్యూస్)**

బీ.ఆర్.ఎస్ అధినేత కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు రామాయంపేటలో ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకల్లో బాగంగా శుక్రవారం ఫుట్ పాత్ వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు.అనంతరం ర్యాలీగా వెళ్లిన నేతలు,కార్యకర్తలు ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు పండ్లు సరఫరా చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు చౌదరి సుప్రభాత్ రావు ఆధ్వర్యంలో సాగిన జన్మదిన వేడుకల్లో కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, పార్టీ నాయకులు మద్దెల రమేశ్,,హాస్నోద్దీన్, అల్లాడి వెంకటి,వినయ్ సాగర్,దోమకొండ యాదగిరి, రొయ్యల నవీన్, జెర్సీ శ్రీనివాస్, నీళ్ళ రాజు, మర్కు రాజు, కన్నాపురం కృష్ణ గౌడ్,నవత్ మహేష్, జామిల్ ఉన్నారు.

# కార్మికులకు ఎస్ఐఆర్‌పై అవగాహన..

- జూలై 26న పటాన్చెరులో ప్రత్యేక సదస్సు
- అర్హులైన ప్రతి ఓటరు నమోదు చేసుకోవాలి: మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్

**పటాన్చెరు, జూలై 24 (సిరి న్యూస్):**

పటాన్చెరు నియోజకవర్గంలో నివసిస్తున్న కార్మికులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన ఓటర్లకు ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు నమోదు) ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 26వ తేదీ ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ తెలిపారు. పటాన్చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటరు వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పటాన్చెరు నియోజకవర్గంలో స్థిర నివాసం ఏర్పరుచుకుని ఓటు హక్కు కలిగిన వారంతా ఈ అవగాహన సదస్సుకు హాజరై ఎస్ఐఆర్‌పై పూర్తి సమాచారం తెలుసుకోవాలని యాదగిరి యాదవ్ కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.



# బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి అండగా ఎమ్మెల్యే జీఎంఆర్..

**ఉన్నత విద్య కోసం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం..**

**పటాన్చెరు, జూలై 24 (సిరి న్యూస్):**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నత విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) మరోసారి విద్యార్థి పక్షపాతిగా నిలిచారు. బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన ఓ నిరుపేద విద్యార్థినికి రూ.1.50 లక్షల ఆర్థిక సహాయం అందించి ఆమె ఉన్నత విద్యకు భరోసా కల్పించారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన హర్షిని 574 మార్కులతో బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం పొందింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఫీజుల చెల్లింపు భారంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. విద్యార్థిని హర్షిని, ఆమె కుటుంబ సభ్యులను కలుసుకున్న ఎమ్మెల్యే, ఆరు సంవత్సరాల విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజుల నిమిత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులు డబ్బు లేక చదువును మధ్యలో ఆపాల్సిన పరిస్థితి రాకూడదని, వారి విద్యాభ్యాసానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే అందించిన ఆర్థిక సహాయంతో హర్షిని కుటుంబంలో ఆనందం నెలకొంది. తమ కూతురు ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**చేర్యాల రూరల్, జూలై 24:**

నీట్ పేపర్ లీకేజీకి ప్రధాన కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు గౌడ్ లు డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులను, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేసిన చర్యను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజు గౌడ్ లు మాట్లాడుతూ విద్యార్థులు నిరుద్యోగులు ఎన్నో ఏళ్లుగా కోచింగ్ లు తీసుకుని ఎంతో కష్టపడి చదివి పరీక్షలు రాసే సమయంలో కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో నీట్ పరీక్షా పేపర్ లీక్ కావడంతో దేశవ్యాప్తంగా 29 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సిబిఐ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సూర సంపత్, బోయిని మల్లేశం, పోట్లపల్లి ప్రశాంత్, గడ్డం ప్రవీణ్, పొరండ్ల చందు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండలం లో విద్యాసంస్థల బంద్ విజయవంతం



**వెల్దుర్తి, జులై 24,( సిరి న్యూస్):**

నీట్ పరీక్ష లీకేజీ కారణమైన కేంద్ర మంత్రిని తప్పించి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ విద్యార్థి సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో వెల్దుర్తి మండలంలో నిర్వహించిన బంద్ శుక్రవారం విజయవంతమైంది. వెల్దుర్తి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి విద్యాసంస్థల బంద్ విజయవంతం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాంబండ శేఖర్, కుమార్, అభిలాష్,ప్రసాద్, జాజాల కృష్ణ, శంకర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలలో టీచర్ ఆయాలను వెంటనే నియమించాలి

## సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ



**వెల్దుర్తి,జులై 24,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మండలంలో నాలుగు పాఠశాలల ను ఎంపిక చేశారు. శెట్టిపల్లి కలాన్.. కుకునూర్,మన్నె వారి జలాల్పూర్, శేరిలా, ఈ గ్రామాలలో మంజూరు అయిన పాఠశాలకి ఇప్పటివరకి టీచర్, ఆయాల ని ఇప్పటివరకు అనుమతించలేరు. అయిన విద్యార్థులు గ్రామస్తుల చొరవతో అలాగే ఉపాధ్యాయుల కృషితో అన్ని గ్రామాల సర్పంచులు విద్యార్థులను పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఇప్పటివరకు 40 రోజులు కావస్తున్న టీచర్,ఆయా,ని ఇవ్వకపోవడం పిల్లలకి చాలా ఇబ్బంది కలిగిస్తుంది ప్రభుత్వం మంచి లక్ష్యంతో గ్రామాలలో ఇంగ్లీష్ విద్య పట్ల మంచి ఆలోచన చేసిందని అందరం సంతోషించాం కానీ ఇప్పటివరకు ప్రతి పాఠశాలలో, ప్రవేట్ పాఠశాల లకు వెళ్లే విద్యార్థులను వాళ్ళ తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థులను చేర్పించటం జరిగింది ఒక్కో పాఠశాల లో పిల్లలు ఇబ్బందులు పడడం చూసి తల్లిదండ్రులు మళ్లీ ప్రైవేట్ పాఠశాల కి పంపించడం జరుగుతుంది. మెదక్ జిల్లాలోని యూకేజీ ఇన్స్ట్రక్టర్లు,ఆయా అనే కార్యక్రమానికి జిల్లాలో 99 పాఠశాలలను నియామకం చేయడం జరిగింది అన్ని పాఠశాల లో ఇలాంటి పరిస్థితి ఉన్నందున.... ఉపాధ్యాయులకు సంబంధించిన యూనియన్స్ ఈ సమస్య పైన దృష్టి సారించాలని కోరుకుంటున్నాం. మాకు ఉన్న సమాచారం ప్రకారం అన్ని మండలాల్లోని స్కూల్స్ టీచర్స్ ఆయా లను అలాట్మెంట్ చేసి ఎంఈఓ లు డిఇఓ ల కు ఇచ్చామని చెప్తున్నారు. జిల్లాలోని కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రామాలలో దరఖాస్తు చేసుకున్న టీచర్స్ అలాగే ఆయా, నియామకం అయిన ఈ బడా నాయకులు మా వర్గానికి చెందిన వాళ్లనే నియమించాలని చేయాలని అధికారుల పైన ఒత్తిడి చేయడం వల్ల ఇప్పటికీ ఈ సమస్య అలాగే ఉన్నదని వారు ఆరోపిస్తున్నారు. ఈ సమస్య పైన మెదక్ జిల్లా కలెక్టర్ తొందరగా నిర్ణయం తీసుకొని మా విద్యార్థులందరికీ మంచి విద్యని అందించాలని కోరుకుంటూ వెల్దుర్తి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ... మండల సర్పంచుల బృందం డిమాండ్ చేస్తున్నారు.

# ఆవడంలో కేటీఆర్ బర్త్ డే జోష్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 24 (సిరి న్యూస్)**

నెన్నెల మండలం ఆవడం గ్రామంలో బి అర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను కార్యకర్తలు,యువత ఘనంగా నిర్వహించారు.బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ,అభివృద్ధి బాటలు వేసిన కేసీఆర్ తనయుడు కేటీఆర్ ప్రజల్లో మన్ననలు పొందారని ఎందరికో ఆదర్శప్రాయుడని కొనియాడారు.ప్రతిపక్ష నాయకుడి హోదాలో అన్యాయాన్ని అరికట్టే శక్తి గా ప్రజల కోసం పోరాడుతున్నాడన్నారు. ప్రజా సేవకుడు కేటీఆర్ నిండునూరేళ్లు రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలు అందిపుచ్చుకుని ప్రజలకోసం నిత్యం కృషి చేయాలని ఆకాంక్షించారు.నిర్వహించిన జన్మదిన వేడుకల్లో కార్యకర్తల జోరు యువత హుషారుతో ప్రధాన కూడలి వద్ద సందడి వాతావరణం నెలకొంది. రబోయేది బీఆర్ ఎస్ ప్రభుత్వం అని ప్రజలు కోరుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆవడం ఉప సర్పంచ్ బెల్లపు రాజీ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,పాపయ్య, యువనాయకులు ఎల్కాటూరి అనిల్, గుమస ఏసు, గుమస పోశం,బెతూ శ్రీశైలం,శేఖర్,లాలు,సత్యం,రాం చందర్,బెతూ మహేష్, మధు, ఆకాష్,లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## మూడ్చు వ్యాధితో గుంతలో పడి వ్యక్తి మృతి..

**హత్నూర, జులై 24,(సిరి న్యూస్)**

మూడ్చు వ్యాధితో పొలం వద్ద నీటి గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు . స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మన్నె యాదగిరి (35) తండ్రి బాలరాజు జగ్గం పేట గ్రామం చిలిపి చేడ్ మండల నికి చెందిన గత 12 రోజుల నుండి హత్నూర మండలం కొన్యాల గ్రామానికి విఠల్ రెడ్డి ,వీరారెడ్డి పొలంలో పనిచేసేవాడు.రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం పనిచేయడానికి వెళ్తున్న సమయంలో మధ్య మార్గం లో కొన్యాల గ్రామానికి చెందిన శేఖర్ పొలం వద్దకు రాగానే అకస్మాత్తు గా ఫిడ్స్ రావడం తో పొలం లోనీ నీటి గుంతలో పడి మృతి చెందాడు.స్థానికులు గమనించి తన కుటుబికులను సమాచారం ఇవ్వగా భార్య మన్నె శ్యామల సంఘటన స్థలాన్ని చేరుకొని గమనించగా అప్పటికే మృతి చెందాడు. బార్య వివరించగా అప్పుడు అప్పుడు చలి,గాలి వల్ల పిడ్స్ వచ్చేదని వ్యాధి ఉందని లేదా ఇతర కారణాల వల్ల కావచ్చు అని హత్నూర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

## స్వచ్ఛందంగా మండల వ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్..

- కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం..

**ఎన్ ఎస్ యు ఐ నాయకులు,పోలీస్ ల మధ్య తోపులాట..**



**హత్నూర, జులై 24,(సిరి న్యూస్)**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని,తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎన్ ఎస్ యు ఐ కాంగ్రెస్ యూత్ నాయకుల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.తక్షణమే స్థానిక పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నం చేయగా ఎన్ ఎస్ యు ఐ కాంగ్రెస్ యూత్ నాయకుల,పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా చార్ల ఆంజనేయులు మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నాడు. విద్యార్థుల గొంతును అణచివేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశాడు. విద్యార్థులపై జరిగిన దాడికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. స్వచ్ఛంద బంద్కు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు, అధ్యాప కులకు, విద్యార్థులకు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు సునీల్ యాదవ్, సాయి చరణ్, అర్జున్, సాయి, శ్రీశైలం దినకర్, అడ్డు, ప్రవీణ్, సుదర్శన్, కిషోర్, రఫీక్ ,శీను , కృష్ణ, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.<

## రాంసానిపల్లి జాతీయ రహదారిపై కారు భీభత్సం

- బైకును ఢీకొట్టి తప్పించుకునే క్రమంలో మరోకారుకు ఢీ
- నలుగురికి తీవ్ర గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు





**జోగిపేట, జూలై 24, (సిరి న్యూస్ ):**

అందోల్ మండల పరిధిలోని రాంసాన్పల్లి గ్రామ శివారులో 161 నాందేడ్–అకోలా జాతీయ రహదారిపై శుక్రవారం ఓ కారు భీభత్సం సృష్టించింది. ఈ ఁసంఘటనకు సంబందించి ఎస్ఐ శ్రీకాంత్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సదాశివపేట మండలం మద్దికుంట గ్రామానికి చెందిన పద్మ, స్వప్న, శ్రీశైలం, నర్సింలు, కృష్ణ, విజయతో పాటు మర్పల్లి మండలం పల్లికుంట గ్రామానికి చెందిన డ్రైవర్ మల్లేశం అనే ఏడుగురు బ్రిజా కారులో మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన అంత్యక్రియలకు హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. అల్లాదుర్గ్ మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన డొక్క రవికుమార్, దృవతేజ అనే తండ్రి కొడుకులు పల్సర్ బైక్పై వెళ్తుండగా అందోల్ మండలం కన్సాన్పల్లి గ్రామ రోడ్డు వద్ద బ్రీజా కారు వెనుక నుండి ఢీకొట్టడంతో వారు కింద పడిపోయారు. వెంటనే డ్రైవర్ కారును నిలుపకుండా తప్పించుకునే ప్రయత్నంలో కారును వేగంగా నడుపుతూ రాంసాన్పల్లి శివారులో జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి సోదరుడి కుమారుడు ఆద ర్శరెడ్డికి చెందిన ఇనోవా కారును బలంగా ఢీకొట్టింది. దీంతో ఇనోవా కారు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. బ్రీజా కారులో ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నర్సింలు, కృష్ణ, విజయల పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జోగిపేట సీఐ అనిల్కుమార్, ఎస్ఐ2 దుర్గయ్యలు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆదర్శరెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బ్రీజా కారు డ్రైవర్ మల్లేశం మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

# మల్లారెడ్డికి తుది వీడ్కోలు..





- కన్నీటి మధ్య మల్లారెడ్డి అంతిమయాత్ర..
- భావోద్వేగంలో నల్లాల ఓదెలు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 24 (సిరి న్యూస్)**

భారతీయ జనతా పార్టీ నాయకుడు, చైతన్య విద్యాసంస్థల అధినేత ముల్కల్ల మల్లారెడ్డి అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామంలో విషాద వాతావరణంలో నిర్వహించారు. ముల్కల్ల మల్లారెడ్డికి తుదివీడ్కోలు పలికేందుకు రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళుల ర్పించారు. అంత్యక్రియలకు హాజరైన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ముల్కల్ల మల్లారెడ్డి పాడెను మోసి తన ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గతంలో తాను పాఠశాల నిర్వహించిన రోజుల నుంచే ముల్కల్ల మల్లారెడ్డితో ఏర్పడిన సన్నిహిత బంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గుర య్యారు. ఎన్నో సామాజిక, విద్యా కార్యక్రమాల్లో కలిసి పనిచేసిన సందర్భాలను స్మరించుకుంటూ ఆయన సేవలను కొనియాడారు. ముల్కల్ల మల్లారెడ్డి విద్యా రంగ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం సమాజానికి తీరని లోటని నల్లాల ఓదెలు పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు కూడా ముల్కల్ల మల్లారెడ్డికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి





- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- పుల్కల్ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన
- కేజీబీవీ, పీహెచ్సీ తనిఖీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన

**జోగిపేట, జూలై 24, (సిరి న్యూస్)**

విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం కల్పించ డానికి సంబంధిత అధికారులు సమర్థవంతంగా పనిచే యాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ పుల్కల్ మండలంలో పర్యటించి మండల కేంద్రంలోనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. ముందుగా బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించిన కలెక్టర్, నూతనంగా నిర్మించిన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని,త్వరగా మంత్రి చేత ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు.

**కేజీబీవీ పాఠశాల సందర్శన**

పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణ, డార్మిటరీ, తరగతి గదులు, స్టోర్రూమ్, వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఈగలు, దోమలు పెరగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా పరిశుభ్రతను పాటిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్, వారితో పాఠ్యాంశాలను చదివించి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు నోట్ బుక్లను అందజేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారికి ఉద్బోధించారు. కలెక్టర్ వెంట ఆయా కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ఎం ఈ ఓ, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## కోవలేంట్ కాలుష్యం పై పంచాయతీ పాలకవర్గం ఆగ్రహం...

### పిసిబి అధికారులకు పిర్యాదు..

**హత్నూర, జులై 24,(సిరి న్యూస్)**

హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామ శివారు లోని కోవాలేంట్ పరిశ్రమ విచ్చవిడిగా విడుదల చేస్తున్న విశ వాయువులపై గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం కోవాలంటే పరిశ్రమ నుంచి ఒక్కసారిగా విశ వాయువులు విడుదల చేయడంతో గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక దశలో ఊపిరాడలేని పరిస్థితి నెలకొంది. పరిశ్రమ విడుదల చేసిన వాయువులను వెంటనే గమనించిన పాలకవర్గ సభ్యులు పరిశ్రమ వద్దకు చేరుకొని పరిశ్రమ ప్రతినిధులపై ఆగ్రహ వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వాయు ,జల కాలుష్యాన్ని విడుదల చేయడంతో గ్రామంలో ఉండలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. అంతేకాకుండా ఈ విషపూరిత వాయువుల వల్ల గ్రామస్తులు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. పలుమార్లు కోవలేంట్ పరిశ్రమ తీరుపై పరిశ్రమ యాజమాన్యానికి సూచించిన పట్టించుకోకాపోవటమేమిటని పరిశ్రమ ప్రతినిధులను నిలదీశారు. ప్రధానంగా బాయిలర్ నుంచి వచ్చే దట్టమైన దుమ్ముతో కూడిన పొగ వల్ల గ్రామంలోని ఇళ్ళ దాబాలపై దుమ్ము ధూళి పెద్ద ఎత్తున మే టలు వేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే పరిశ్రమ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం అక్కడి నుంచి తరలి వెళ్లి సంగారెడ్డి లోని బిసిబి కార్యాలయంలో ఈ ఈ కి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీహరి ఉపసర్పంచ్ శంకర్ వార్డు సభ్యులు భద్రేశ్ అంకిత ప్రభాకర్, లక్ష్మీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





# పాస్తా తింటున్నారా.. కాస్త ఆగండి!





ప్రస్తుతం పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినే ఆహార పదార్థాల్లో పాస్తా కూడా ఉంటుంది. అయితే, చాలామంది పాస్తాను రెగ్యులర్ గా పిల్లలకు చేసి పెడుతున్నారు. దానికి కారణం అడిగితే, సమయం లేకపోవడమో లేదా పిల్లలకు అదే నచ్చుతుందనో.. చెప్తుంటారు. కానీ, అలా తినడం వల్ల ఆరోగ్యానికి మంచిదేనా? అసలు పాస్తా దేంతో తయారుచేస్తారో వంటి విషయాల మీద అవగాహన ఉందా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మరి ఇప్పటికైనా.. అవగాహన తెచ్చుకుందాం.

సాధారణంగా గోధుమ పిండిలో గుడ్లు, లేదా నీరు కలిపి ఉడికించిన తర్వాత పిల్లలను ఆకర్షించేలా రకరకాల రూపాల్లో పాస్తాను తయారు చేస్తారు. ప్రాసెస్ చేసిన పిండితో తయారు చేస్తారు.

పాస్తా అందరికీ అనారోగ్యకరమైన ఆహార పదార్థం కాదు. కేవలం కొందరికి మాత్రమే ఇది హాని చేసే అవకాశాలు ఉన్నాయట. అది కూడా ఎంత మొత్తంలో తింటున్నారు అనే దానిపై ఆధారపడి ఉంటుందట. అంటే సాధారణంగా పాస్తాను పూటకు సుమారు రెండు ఔన్సులు అంటే ఒక కప్పు మాత్రమే తీసుకోవాలి.

అలాగే.. అధిక కార్బోహైడ్రేట్లు కలిగిన పాస్తా తినడం అందరికీ అనారోగ్యకరంa కాదని, కేవలం డైటింగ్ చేసేవాళ్లు, బరువు తగ్గాలనుకునే వారు మాత్రం వీటికి దూరంగా ఉంటే చాలు అని తాజా స్టడీలు చెప్తున్నాయి.

ఒక కప్పు పాస్తాలో సుమారు 200కేలరీలు, 40గ్రాముల కార్బోహైడ్రేట్లు, 6గ్రాముల ప్రొటీన్, ఒకటి నుంచి 2 గ్రాముల ఫైబర్ ఉంటాయి. అలాగే పిండితో తయారు చేసింది కనుక పాస్తలో కేలరీలు అస్సలు వుండవనీ, కార్బోహైడ్రేట్లతో నిండి ఉంటుందని చెబుతున్నారు. కాబట్టి పాస్తా పోషకాహారంగా పనిచేస్తుందట.

హోల్ గ్రెయిన్ పాస్తాలో ఫైబర్, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కడుపు ఎక్కువ సేపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించి అతిగా తినే అవకాశాలను తగ్గిస్తాయి. కాబట్టి మీకు ఇష్టమైన పాస్తాను మీరు తప్పకుండా తినచ్చు.

**కేలరీలు ఎందుకు పెరుగుతాయంటే..**

పాస్తా ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ దీనికి సాస్లు, వెన్న, క్రీమ్, మాంసాలు లేదా చీజ్ వంటి వాటిని జోడించడం వల్ల కేలరీలు పెరుగుతాయి. ఫలితంగా పోషకాల అసమతుల్యత సమస్య తలెత్తి జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదముంది. మితంగా తింటే పర్వాలేదు. కానీ, మితిమీరి తినడం వల్ల ఆహార అసమతుల్యత ఏర్పడి అనారోగ్యకరంగా మారుతుంది. ఇది మీ జీర్ణ వ్యవస్థకు హాని చేసే అవకాశముంది. పాస్తాను ఎప్పుడూ పూర్తి భోజనంగా తీసుకోకూడదు. గోధుమ పిండితో తయారయ్యే పాస్తాలో ఫైబర్, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. కానీ, మార్కెట్లో రకరకాల పాస్తాలు దొరుకుతున్నాయి. చూసి కొనుక్కుంటే బెటర్.

---

## ఆషాఢంలో గోరింట..

# మనసెంతో మురిసెనంట!





ఆషాడంలో ప్రతి ఆడపిల్లకి గోరింటాకు పెట్టుకోవడంలో ఉండే సంబురం అంతా ఇంతా కాదు. మిగతా రోజుల్లో పెట్టుకున్నా,పెట్టుకోకపోయినా.. ఆషాఢమాసంలో మాత్రం చేతులకు, కాళ్లకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోతుంటారు.

అయితే ఆషాఢంలోనే ఎందుకు పెట్టుకోవాలి అంటే..

మన వాతావరణం ప్రకారం ఆషాడంలో వర్షా లు పడుతుంటాయి. దీంతో వాతావరణం అంతా చల్లగా మారుతుంది. కానీ, ఒంట్లో వేడి అలానే ఉంటుంది. బయట వాతావరణానికి సమానంగా మన శరీర ఉష్ణోగ్రత మారదు. దీంతో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం వస్తుంది. గోరింటాకులో వేడిని తగ్గించే గుణం ఉంటుంది. అంతేకాకుండా రోగ నిరోధక శక్తిని పెంచి, రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఈ సమయంలో గోరింటాకు పెట్టుకోవాలని చెప్తారు.

ఆడవారు గోరింటాకు పెట్టుకోవడానికి మరో ముఖ్య కారణం ఏంటంటే.. ఆడవారు ఎక్కువగా డిటర్జెంట్స్, సర్ఫులను వాడుతారు. ఈ సమయంలో వారి గోళ్లలో నీరు ఎక్కువగా చేరి సమమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఆ సమస్యలన్నీ దూరం అవుతాయని అంటారు. ఇక్కడ ఇంట్రెస్టింగ్ పాయింట్ ఒకటుంది.

---

## డెంగ్యూ లక్షణాలు, చికిత్స

# మీకు తెలుసా ?




డెంగ్యూ జ్వరం, దోమల ద్వారా సంక్రమించే వైరల్ ఇన్ఫెక్షన్, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో, ముఖ్యంగా ఉష్ణమండల , ఉపఉష్ణమండల ప్రాంతాలలో గణనీయమైన ఆరోగ్య ముప్పును కలిగిస్తుంది. ఈ వ్యది తీవ్రమైన అనారోగ్యాన్ని కలిస్తుంది. అయితే పూర్తి స్థాయిలో అవగాన కలిగి సమర్థవంతంగా వ్యాది సోకుండా జాగ్రత్తలు పాటించవచ్చు. అయితే ఒక వేళ వ్యాధి బారీన పడిలే ఎలాంటి లక్షణాలు ఉంటాయి తగు జాగ్రతల గురించి తెలుసుకుందాం.



### డెంగ్యూ జ్వరం లక్షణాలు

**ఆకస్మిక ప్రారంభం:** డెంగ్యూ జ్వరం సాధారణంగా అకస్మాత్తుగా అధిక జ్వరంతో ప్రారంభమవుతుంది, తరచుగా 104 F (40 C) వరకు చేరుకుంటుంది. ఈ జ్వరం 2 నుండి 7 రోజుల వరకు ఉంటుంది.

**తీవ్రమైన తలనొప్పి మరియు నొప్పి :** తీవ్రమైన తలనొప్పి, ముఖ్యంగా కళ్ళ వెనుక, సాధారణం. కండరాలు మరియు కీళ్ల నొప్పులు ఉంటాయి. దీన్ని "బ్రేక్‌బోన్ ఫీవర్" అని కూడా పిలుస్తారు, ఇది తీవ్రంగా ఉంటుంది మరియు గణనీయమైన అసౌకర్యానికి దారితీస్తుంది.చర్మంపై దద్దుర్లు మరియు రక్తస్రావం: జ్వరం ప్రారంభమైన 2 నుండి 5 రోజుల తర్వాత ఒక లక్షణం చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయి, దానితో పాటు ముక్కు లేదా చిగుళ్ళ నుండి చిన్న రక్తస్రా జరగవచ్చు.

**ఇతర లక్షణాలు:** వికారం, వాంతులు, వాపు శోషరస గ్రంథులు మరియు తేలికపాటి నుండి తీవ్రమైన కడుపు నొప్పి అనారోగ్యం యొక్క తీవ్రమైన దశలో వ్యక్తమయ్యే అదనపు సంకేతాలు.

### రోగ నిర్ధారణ మరియు చికిత్స

**రోగనిర్ధారణ పరీక్షలు:** డెంగ్యూ జ్వరం వైరస్ లేదా దాని ప్రతిరోధకాలను గుర్తించే రక్త పరీక్షల ద్వారా నిర్ధారణ చేయవచ్చు. సకాలంలో వైద్యుని వద్దకు వెళితే ముందస్తుగా గుర్తించడం చాలా సులువు అవుతుంది. .

**వైద్య సంరక్షణ:** డెంగ్యూ జ్వరానికి నిర్దిష్ట యాంటీవైరల్ చికిత్స లేదు. చికిత్స ప్రాథమికంగా లక్షణాలను తగ్గించడానికి , సమస్యలను నివారించడానికి సహాయక సంరక్షణపై దృష్టి పెడుతుంది. ఇందులో ఇవి ఉన్నాయి

**ఫ్లూయిడ్ రీప్లేస్‌మెంట్:** డీహైడ్రేషన్‌ను నివారించడానికి, ప్రత్యేకించి జ్వరం వచ్చే దశలో తగినంత ఆర్ద్రీకరణ అవసరం.

**నొప్పి ఉపశమనం:** ఎసిటమైనోఫెన్ వంటి ఓవర్‌దికౌంటర్ నొప్పి నివారణలు జ్వరాన్ని నిర్వహించడానికి మరియు నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఇబుప్రోఫెన్ మరియు ఆస్పిరిన్ వంటి నాన్‌స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ (NSAIDలు) మానుకోండి, ఎందుకంటే అవి రక్తస్రావం ప్రమాదాన్ని పెంచుతాయి.

**మానిటరింగ్:** ముఖ్యంగా తీవ్రమైన డెంగ్యూ (డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్ లేదా డెంగ్యూ షాక్ సిండ్రోమ్) సంకేతాల కోసం లక్షణాలను



### నివారణ చర్యలు

**దోమల నియంత్రణ:** డెంగ్యూ జ్వరం వ్యాప్తిని తగ్గించడంలో దోమలను నివారించడం కీలకం. కీటక వికర్షకాలను ఉపయోగించండి, పొడవాటి చేతుల దుస్తులు ధరించండి మరియు దోమల నుండి రక్షించడానికి దోమ తెరలు లేదా తెరలను ఉపయోగించండి, ముఖ్యంగా డెంగ్యూ వైరస్ యొక్క వెక్టర్ అయిన ఏడిస్ దోమలు చాలా చురుకుగా పగటిపూట ఉంటాయి.

**పర్యావరణ చర్యలు:** కంటైనర్లు, పూల కుండీలు మరియు నిలిచిపోయిన మురికి కాలువలు వంటి దోమలు వృద్ధి చెందే చోట నిలబడి ఉన్న నీటిని తొలగించడం ద్వారా సంతానోత్పత్తి ప్రదేశాలను తొలగించండి.

**కమ్యూనిటీ అవగాహన:** డెంగ్యూ జ్వర లక్షణాలు, నివారణ పద్ధతులు, ముందుగానే వైద్య సంరక్షణ పొందడం యొక్క ప్రాముఖ్యత గురించి కమ్యూనిటీలకు అవగాహన కల్పించడం వ్యాప్తిని తగ్గించడంలో సహాయపడుతుంది.



## ఆ ఒక్క కారణంతోనే సినీ రంగంలోకి వచ్చా..: రకుల్‌ప్రీత్ సింగ్

సినీ రంగంలోకి రావాలని తానెప్పుడూ అనుకోలేదని, అంతా యాదృచ్ఛికంగా జరిగిపోయిందని నటి రకుల్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్ ఆరంభం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

''అనుకోకుండా నాకు కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి అవకాశం వచ్చింది. నేను కాలేజీలో చదివేటప్పుడు నా ఫొటోలు చూసి ఎవరో కొంతమంది మా నాన్నని కలిశారు. ఓ మూవీలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. సినిమాలపై అప్పుడంత అవగాహన కూడా నాకు లేదు. కానీ, వాళ్లు ఆ సినిమాకు రూ.5 లక్షలు పారితోషికంగా ఇస్తామన్నారు. దాంతో నేను కారు కొనుక్కోవాలనుకున్నా. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతానన్న ఒకే ఒక్క కారణంతో ఆ మూవీకి ఓకే చెప్పా''

''ఆ తర్వాత నేను 40 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. కెమెరా ముందు పని చేయడం నాకు ఎంతగానో నచ్చింది. ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఆ తర్వాత నటనను కొనసాగిద్దామని నిర్ణయించుకున్నా. అందుకే గ్యాప్ వచ్చి 2013లో రీఎంట్రీ ఇచ్చాను. నేను ఎవరి ప్రమేయం లేకుండానే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టాను. నాకు నేనుగా అన్నీ నేర్చుకున్నా. మొదట్లో చదువు, అటెండెన్స్ కారణంగా నేను కొన్ని పెద్ద సినిమాలు వదులుకోవాల్సి వచ్చింది'' అని రకుల్ వివరించారు.

ఇక, రకుల్ ప్రీత్ 2009లో కన్నడ చిత్రం 'గిల్లీ'తో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. చదువు పూర్తయ్యాక 2013లో 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత 'లౌక్యం', 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు', 'ధృవ', 'స్పైడర్', 'ఖాకీ' వంటి హిట్ సినిమాల్లో నటించారు. 2014లో 'యారియాన్'తో హిందీలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం రకుల్ 'రామాయణ'లో నటిస్తున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఇతిహాసగాథలో రకుల్ శూర్పణఖగా నటిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ పార్ట్1 ఈ దీపావళి రానుంది.

# ఆ రోజు రాజీపడుంటే... ఇక అంతే!



హిందీ చిత్రపరిశ్రమలో ఓ సినిమా రాత్రికి రాత్రే స్టార్‌ని చేసినప్పటికీ... తాను కలిసి పనిచేయాలనుకున్న దర్శకుల నుంచి అవకాశాలు పొందడానికి చాలా కష్టపడ్డానని అంటున్నారు అగ్రతార ఆమిర్‌ఖాన్. ఇటీవల బీఎఫ్‌ఐ లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆయన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న సవాళ్లు, ఆనాటి సంగతుల్ని గుర్తుచేసుకున్నారు.

''చిత్రపరిశ్రమలో నా కెరీర్ ప్రారంభంలోనే 'ఖయామత్ సే ఖయామత్ తక్'(1998) చిత్రం పెద్ద విజయం సాధించింది. రాత్రికి రాత్రే స్టార్ అయిపోయాను. కానీ ఆ సమయంలో పరిస్థితులు వేరు. ఏ గ్రేడ్ చిత్రనిర్మాతలు ఇలాంటి హిట్‌లను అంతగా పరిగణించేవారు కాదు. అందుకే నా ఖాతాలో అంత పెద్ద విజయం ఉన్నా నేను కలిసి పని చేయాలనుకున్నా దర్శకులెవరూ నన్ను సంప్రదించలేదు. నేను కోరుకున్న పని నాకు దొరకలేదు. కొత్త దర్శకులతో దాదాపు పది సినిమాల వరకూ సంతకం చేశాను. కానీ ఆ చిత్రాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి విడుదలై నిరాశపరిచాయి. దాంతో నాపై 'వన్ ఫిల్మ్ వండర్' అనే ముద్ర పడింది. అప్పుడు చాలా కుంగిపోయాను. ఆ సమయంలో దర్శకుడు మహేశ్ భట్ ప్రాజెక్ట్ ఒకటి నా దగ్గరికి వచ్చింది. రాత్రంతా ఆలోచించి నాకు స్క్రిప్ట్ నచ్చలేదు, సినిమా చేయలేనని చెప్పాను. అటువంటి పరిస్థితుల్లో ఆయనకు నో చెప్పే ధైర్యం చేయడమే నా జీవితంలో పెద్ద మలుపు. ఒకవేళ నేను ఆ రోజు రాజీపడి ఉంటే నా కెరీర్ మొత్తం రాజీలతో నిండిపోయి ఉండేదేమో'' అని చెప్పారు ఆమిర్.





## హాలీవుడ్‌కు దీటుగా రామాయణ ప్రపంచం

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. ''అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుంద''ని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్‌కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది.

ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ''ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా.ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం'' అన్నారు.

యశ్ మాట్లాడుతూ.. ''ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద''ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.

## సినీ ప్రయాణానికి 17 ఏళ్లు.. ఎన్నో పాఠాలు నేర్చుకున్నా: శ్రుతి

బహుభాషా నటి, గాయని శ్రుతిహాసన్ భారతీయ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 17 ఏళ్లు పూర్తయ్యాయి. 2009లో బాలీవుడ్ చిత్రం 'లక్'తో ఆమె నటిగా తెరంగేట్రం చేశారు. అప్పటినుంచి హిందీ, తమిళ, తెలుగు భాషల్లో తనదైన ముద్ర వేశారు. నటనతో పాటు తనకిష్టమైన సంగీత రంగంలోనూ రాణిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తన సినీ ప్రయాణం గురించి తాజాగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిత్రపరిశ్రమ తనకు సాంకేతిక విషయాలతో పాటు, జీవిత పాఠాలను కూడా నేర్పిందని చెప్పారు.

''ఈ ప్రయాణంలో నా గురించి నేను చాలా విషయాలు తెలుసుకున్నాను. నా వృత్తి, చుట్టూ ఉన్న మనుషులు ఎలా ఉంటారనేది అర్థమైంది. కొన్ని సినిమాలకు విజయాలు దక్కాయి. మరికొన్ని ఫ్లాప్ అయ్యాయి. ఈ క్రమంలో అందరం కలిసి ఎలా పనిచేయాలో నేర్చుకున్నాను. ఒకే పరిశ్రమకు, ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా.. విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ ముందుకెళ్లాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు చూశాను. చిత్ర పరిశ్రమ నుంచి నేను నేర్చుకున్న ఒక ముఖ్యమైన విషయమేంటంటే.. ఈ ప్రయాణం నన్ను మానసికంగా చాలా దృఢంగా మార్చింది. దీంతో నేను కష్టాలను తట్టుకుంటూ, మొండిగా తయారయ్యాను'' అని పేర్కొన్నారు.

ఇక, శ్రుతిహాసన్ సినీ కెరీర్‌లో ప్రముఖ కథానాయకుడు ధనుష్‌తో నటించిన తమిళ చిత్రం '3' మూవీ (3Movie)కి ప్రత్యేక స్థానం ఉంది. ఆ సినిమాలోని 'కొలవెరి డి' పాటకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు లభించింది. అందులో 'జనని' పాత్రలో శ్రుతిహాసన్ నటనకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత ఆమె.. తెలుగులో 'రేసుగుర్రం', 'శ్రీమంతుడు', 'క్రాక్', 'వీరసింహారెడ్డి', 'సలార్: పార్ట్ 1' వంటి బ్లాక్‌బస్టర్ చి-

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.